సంఘటన

మంజీర

భీమయ్య పగలు శ్రమానం పక్షిలా పనిచేసి యింటికొచ్చేసరికి, యీ మధ్యనెప్పుడు చూసినా తనపెళ్ళాం పలుగడమో, మూల్గడమో జరుగుతూ వుండేది. అరడజనుమంది పిల్లలతో, అమితంగా ఆయాసపడుతూ, సరయిన తిండిలేక, నిస్సత్తువతో, నిరాశతో నిస్పృహతో, కొట్లాడే ఆమెముఖం చూడగానే, ఆ పలుకులకు మూల్గులకు కారణం పక్కంగా గోచరించేది. అపార విచారంతో కుంగిపోయేవాడు భీమయ్య నోట మాటపెగలక. తను తండ్రి అయినందుకు పిల్లలకు ఏ విధమయిన సౌఖ్యం కలిగించలేక పోతున్నానన్న, చింత అతనికి అడుగడుగునా అడ్డు తగులుతోంది.

తన జీవిత సర్వస్వమైన ఉద్యోగంలో ఎన్నేళ్ళు గడిచినా, ఎదుగూ బొదుగూ లేకుండా పోతోంది. అలాగే బ్రతుకుతున్నాడు చెలురులో నడిచే గ్రుడ్డివాడిలాగ. తన పనిలో ఏదుగూ, బొదుగూ ఉండా, లేదా, అని ఆలోచించడానికికూడా భీమయ్యకు తీరిక చిక్కడంకాదు. ఉన్న ఉద్యోగమే మహాభాగ్యం.

అతని పరిసరాల్లో ఉన్న ప్రతివ్యక్తీ పూర్తిగా అతనిలాంటి పరిస్థితులలోనే ఉండడంవల్ల, తనబాధ, కష్టం, దిగమింగి ఊరుకోడం అలవాటయింది అందరిలాగే.

జబ్బుతో, నీరసంతో మూల్గుతూన్న తన భార్యనూ, సరయిన తిండి, బట్టా, కైనా నోచుకోని పిల్లలనూ, చూచినపుడు అతని మనస్సు సముద్రంలా క్షుభిత మవుతూంటుంది.

భీమయ్య భార్యాబాధలో దించినతలయెత్తకుండా, మౌనంగా క్రిందికిచూస్తూ నేలపై వేసే అడుగు లొక్కొక్కటే లెక్కపెడుతూ నెమ్మదిగా చక్కావచ్చాడు యింటికి రోజులాగే. తన్ను దూరాన్నుంచే చూసి గుమ్మంవద్దకు "నాన్నా నాన్నా" అంటూ స్వాగతమిచ్చే పిల్లలనెత్తుకుని యింట్లో కెళ్ళాడు.

మూలుగుతూ జ్వరంతో పడుకుంది భార్య. "వచ్చారా" అంది అడుగుల సవ్వడివిని కాబోలు. భీమయ్య కేమి ఎలా మాట్లాడాలో పాలుపోయిందికాదు. ఆమె మంచం దగ్గరగా వెళ్ళాడు. ఆమె శరీరం నిప్పులు గ్రక్కుతోంది.

"ఏం, ఎలా ఉంది" అన్నాడు.

"మామూలుగానే" అందామె తను పడుతూన్న బాధను కప్పిపుచ్చుదామన్న వ్యర్థ ప్రయత్నంతో.

"జ్వరం బాగానే వచ్చిందే," అన్నాడు ఆందోళనతో.

"ఎప్పుడూ వున్నదేగా" అందామె నీరసంగా.

"పోనీ, డాక్టరుని పిలవనా?" అంటూ నేలమీద చతికిలబడ్డాడు.

"మరి ఆయనకియ్యడానికి పైకో" అందామె తాపీగా. డాక్టరుని పిలిస్తే బాధ కాస్త తగ్గుతుందేమోనన్న ఆమె ఆశ మసగ్గా ఆమాటల ముసుగులోంచి కనిపిస్తోంది, వెల్లవేసినా కనిపించే అక్షరాల్లాగ.

"డబ్బేటి. అదు మనగురించే ఉన్నాట్ట"

"డబ్బియ్యకపోతే మందియ్యడటగా."

"ఆడి బాబుగారిమందేటి? మన కోసమే పెట్టారుట ఆసుపత్రి" అన్నాడు భీమయ్య ఉద్రేకంతో.

పేదవాడి కోపం పెదవికి చేటు.

"ఏమో, అందరూ అలా అంటారు", అందామె అటునుంచి యిటు తిరిగి.

"మరి మా వర్కుషాపులో ఆఫీసరు అలా సెప్తాడు. అదంతా మన బాగుకేనట."

"ఏమో మరిపిలు" అంది.

భీమయ్య ఆ బట్టలతోనే బయలుదేరాడు డాక్టరు వద్దకు. ఆ డాక్టరు యింట్లో అరుగు మీద కూర్చున్నాడు తలవంచుకుని భీమయ్య.



అనేక సంవత్సరముల అనుభవముతో నవీన పద్ధతులలో మాచే తయారుచేయబడిన యినుపపెట్టెలు, ఉక్కు బీరువాలు, క్యాష్ బాక్సులు, మరియు ఆఫీసు రాకులు సరసమైన ధరలకు సకాలములో తయారుచేసి యివ్వగలము.

ఆంధ్రదేశీయు ఈ పరిశ్రమను ప్రోత్సహించండి.

ఆంధ్ర సేఫ్ కంపెని,

ఫాక్టరీ:	వర్కుషాపు:
సరస్వతీటాకీస్ రోడ్,	మునిసిపల్ ఆఫీసురోడ్,
విజయవాడ-1.	విజయవాడ-1.

బ్రాంచి: ప్రకాశంరోడ్ - విజయవాడ-2.

మెయిన్‌రోడ్, చీరాల

ఆంధ్రప్రదేశ్ ముఖ్యపట్టణములలో సేల్సుఏజంట్లు కావలెను. వివరములకు వ్రాయండి.

ఒక గంట గడిచాక డాక్టరుగారు వచ్చారు. భీమయ్యను చూచీచూడ్డంతోనే,

"వచ్చావా అప్పుడే. యేం కొంప మునిగిపోయింది. దొంగ జబ్బులూ మీరూను. పని యెగ్గొయడానికి," అంటూ అతని దగ్గరకు వచ్చి అతనిచేయి పట్టుకున్నాడు. భీమయ్య నిర్ఘాంతపోయాడు.

"నీకు జబ్బేమిటోయి. ఈ దొంగవేషాలు వెయ్యకపోతే తిన్నగా పని చెయ్యరాదూ" అన్నాడు.

"నాకుగాదండి బాబూ జబ్బు" అని నసిగాడు భీమయ్య.

"ఆ!...నీకుగాదూ. అలా చెప్పవేం ముందట. డాక్టరుతో మాట్లాడ్డానికిగూడ భయం అయితే యెలావచ్చేది చెప్పూ"

భీమయ్య సంగతి వెల్లడించాడు.

"మీ యిల్లెక్కడ" అన్నాడు డాక్టరు.

"కూలీలపేటలో చివరియిల్లు"

"తెలుస్తుందా అక్కడ యెవర్నైనా అడిగితే."

"కష్టంబాబూ. తమరు నాతోడా దయచేయించండి."

"అయితే పద" అంటూ డాక్టరుగారు తన సైకిలు తీసుకున్నారు.

భీమయ్యయిల్లు చేరారు యిద్దరూ. డాక్టరు భీమయ్యభార్యను పరీక్ష చేశాడు. జబ్బు చాలా పెద్దదని, జాగ్రత్తగా వుండాలని శలవిచ్చాడు. పండ్లూ, పాలూ హెచ్చుగా యివ్వాలన్నాడు. ఎక్కడనుంచి యెలా తేవాలో భీమయ్య ఆలోచిస్తున్నాడు. డాక్టరు ఏదో కాగితంమీద రాసి యిచ్చాడు. భీమయ్య ఆనందంతో అంది పుచ్చుకున్నాడు. డాక్టరు ఆ కంపుపాకలో నిలబడలేక వీధిలోకొచ్చేశాడు. పాక వైపు చూస్తూ నిలబడ్డాడు. భీమయ్య లోపలనుంచి యింకా పైకిరాలేదు. డాక్టరు విసుగ్గా సైకిలుబెల్లు గణగణ మోగించాడు. భీమయ్య గబగబా పరుగున పైకివచ్చాడు. చేతులు నలుపుతూ డాక్టరుముందు నిలబడ్డాడు.

"నా ఫీజుమాట యేమిటు" అన్నాడు డాక్టరు మెల్లగా అతనిమీదున్న అసహ్యాన్ని దిగమ్రింగుతూ. భీమయ్యకేం చెప్పాలో తెలీడంలేదు. డాక్టరు తనగురించి ఉన్నప్పుడు తను ఫీజెందుకివ్వాలో అర్థమవలేదు.

అయినా డాక్టరు డాక్టరే. ఆయన ఫీజు యిచ్చితీరవలసిందే. రోగంకుదిరినా, కుదరకపోయినా, రోగి బ్రతికినా బ్రతక్కపోయినా, డాక్టరు డాక్టరే మరి.

"బాబూ ప్రస్తుతం నాదగ్గర దమ్మిడీకూడా లేదు. తరువాతిచ్చుకుంటాను" అన్నాడు చాలాబాధతో క్రుంగిపోతూ.

"అంతలేనప్పుడు యీ వైద్యాలన్నీ యెందుకోయి? డాక్టరుకు డబ్బివ్వకుండా మందుకొనకుండా, పన్నూ పాలూ రోగికివ్వకుండా జబ్బులు కుదురుతాయా? యీ గొడవంతా యెందుకు? ఏదో ఆకో అలమూ వేసేయి అంతలేనప్పుడు" అంటూ సైకిలెక్కాడు డాక్టరుగారు.

భీమయ్య విచారంగా ఆ అశ్వనీదేవత అదృశ్యమయినదిక్కు రెప్పవాల్చకుండా చూస్తూ నిలబడ్డాడు కొన్ని నిముషాలు. కొంతసేపయాక మందుకు పెద్దపిల్లాణ్ని పంపి, తను వంట మొదలుపెట్టాడు. భీమయ్యభార్య

★ సంఘటన ★

ఆ జ్వరంలోనే పిల్లలనూరడిస్తోంది.

వీధిలోనుండి "భీమయ్యా! భీమయ్యా" అని కేకలు వినిపించాయి. చటుక్కునలేచి వీధిలోకిపోయాడు. "అరె యమదూతలా ప్రత్యక్షమయాడు" అనుకున్నాడు లోలోపల. "యేం. ఏం ముంచుకొచ్చింది" అని ప్రశ్నించాడు.

"యేయీముంచ నేదు. దీనిమీద సంతకం సెయ్యి" అన్నాడు వ్యాను ఓ పుస్తకం అందిస్తూ.

"ఆ సంతకమే సెయ్యడంవత్తే యీ బ్రతుకెందుకులే? అసలు యిసయం సెప్పు" అన్నాడు భీమయ్య.

"యేటుందిలే. మామూలే. ముందు నిశానీ పెట్టు"

"అసలుసంగతి సెప్పవోయి" అన్నాడు ఆందోళనగా.

"యేంవోయ్. యీయాళ అంత నిరాగ్గా వున్నావు" అన్నాడతడు భీమయ్య ముఖంలోని విచారరేఖలు వీక్షిస్తూ.

"యింట్లో ఆడదానికి బాగోనేదు. సానా జొరంగావుంది. డాకటేరువచ్చి సూచి పోయిండు కోపంతో."

"కోపం ఎందుకు"

"ఫీజు యివ్వనేదుట! ఫీజు."

"ఓహో అదా సమాచారం. అసలాళ్ళు డబ్బు యివ్వకపోతే సూడనేసూడరు. ఆ మందునీళ్ళన్నా యిధిలేక యిత్తున్నారు గాని."

"అయితే ఆడిచ్చేమందు మంచిదిగాదా?" అన్నాడు సందేహంతో.

"డబ్బు సేతిలోపడకపోతే ఆడు మందని, నీళ్ళే యిత్తాడు. వట్టినీళ్ళు! అళ్ళకెంత గడించినా సరిపోదు."

"అరె మరయితే యెనాగ? ఎంత పెద్ద జొరమొచ్చిందనుకుంటున్నావు."

"మరేటిసేత్తాం? ఆమద్దిన నా పిల్లోడికి జబ్బుచేత్తే యినాగే అయినాది. ఆడిచ్చిన మందుతాగి, పిల్లాడిపాణాలమీదికి తెచ్చాం. ఆఖరికి అప్పోసొప్పోచేసి డబ్బిత్తే సెమ్మదిగా బాగుచేసిండు. డబ్బు యెంతిబాగా గుంజుకున్నాడనుకున్నావ్. ఆ పని ఆళ్ళకు బాగా తెల్సునులే, ఆ అప్పు యింకా తీరనేలేదు. కాబూలీ వోడికి వడ్డీ కడుతూనే వున్నాను. యేటోవడ్డీ కట్టడమే గాని అసలు తీరే యిసయమేతోచదు.

"అయితే యెనాగ. మాకూ నీళ్లే యిత్తాడంటావా?"

"నీకు నీళ్లిత్తే ఆడికేవన్నా నట్టమాయేటి, సెప్పు తప్పకుండా నీళ్ళే యిత్తాడు. డబ్బిత్తేమందిత్తాడు. అప్పుచేసి యియ్యి డబ్బు."

"యేదో సెయాలమరి. అసలు యేటి సంగతి సెప్పు."

"యీ పక్కూరులో బండి బాగు సెయ్యాలట. అర్జంటు. పెట్టునిశానీ. యీ మొదటి బండికే పోవాల" అన్నాడు తను వచ్చిన పని మరచిపోయినందుకు కొస్త ఆందోళన పడుతూ.

"యింటిదగ్గరసూత్తే యిదీ వరస. అయితే యెళ్ళక తప్పదంటావా" అన్నాడు భీమయ్య వేలిముద్ర వేస్తూ.

"తప్పుద్దా. యెళ్ళి తీరాల. నేకపోతే సాన సిక్కొచ్చిపడతాది. యెళ్ళక తప్పదు" అంటూ పుస్తకం ముడిచి తనదారిన తనుపోయాడు.

భీమయ్య వేగంగా వంట ముగించి బండి వేళకు సరిగా తనతో రాబోయే పనివాళ్ళను స్టేషనులో కలుసుకున్నాడు. ఇంత ఆలస్యం అయిందేమంటూ ఉరిమాడు మేస్త్రీ. భీమయ్య కిక్కురు మనకుండా నిలబడ్డాడు. అందరూ బండి యెక్కేరు పనున్న వూరు పోవడానికి. ఎవరికి తోచిన కబుర్లు వాళ్ళు చెపుతూన్నారు. భీమయ్య మనస్సంతా యింటిమీదనేవుంది. బండిలో ఓమూల కొదిగి కూర్చున్నాడు. పనివాళ్ళు రెండు మూడు సార్లు హెచ్చరించినా ముభావంగా ఊరుకున్నాడు. వాళ్లు కూడా యితని సంగతి అట్టే పట్టించుకోలేదు.

బండి సెమ్మదిగా రాత్రి పదిన్నరకు చేరుకుంది ఆ ప్రదేశం. అందరూ దిగారక్కడ. మేస్త్రీ ఉత్తర్వు ప్రకారం, అచ్చట చేయవలసినపని చురుకుగా సాగించేరు, భీమయ్య కూడా అందరితోపాటు ఎలాగో ఓలాగ పనిని లాగేస్తున్నాడు. చేయవలసిన పని రెండు గంటల రాత్రికి ఆఖరు అయింది. అప్పుడేవున్న తిరుగు బండిలో అందరూ యింటికి తిరుగు ప్రయాణం అవుతున్నారు.

మేస్త్రీ భీమయ్యను పిలచి తెల్లవారే వరకూ అక్కడేవుండి, ఆ బండి బాగయినట్లు చూపించే కాగితాలు, తాఖీదులూ స్టేషను మాష్టరుగారివద్దనుండి పుచ్చుకుని తీసుకురమ్మన్నాడు. భీమయ్య తన పరిస్థితి తెలియజేసి మేస్త్రీని బ్రతిమాలుకున్నాడు. మేస్త్రీ భీమయ్య మాటలు నమ్మలేదు.

భీమయ్య మేస్త్రీకన్న చిన్న ఉద్యోగస్థుడు. పెద్ద ఉద్యోగస్థుడు తన క్రింద ఉద్యోగస్థునిమాట నమ్మడు. నమ్మలేదు. నమ్మబోడు.

బ్రతిమాలినకొద్దీ యితన్నే ఉండమని

ప్రశస్తమైన కాఫీ పౌడరు

Fresh, Fragrant & Delicious

ఆంధ్రా కాఫీ పౌడరు

ANDHRA Coffee

ఆంధ్రా కాఫీ యిండస్ట్రీ, గుంటూరు.

Quality is our Motto

స్వచ్ఛమైనది

శ్రేష్ఠమైనది

బ్రాంచీలు:- బ్రాడీపేట, బాపట్ల, సత్తెనపల్లి, నర్సరావుపేట, నిడుబ్రోలు.

ఆంధ్రా కాఫీ ఇండస్ట్రీ

H. O. పట్నంబజారు - గుంటూరు-1

మేస్త్రీగారి ఉత్తర్వు. తన ఊరికై పుపోయే బండిని, అందులో పోతూన్న తనతోటి పని వాళ్ళనూ చూస్తూ బాధగా నిలబడ్డాడు రాతి బొమ్మలాగ.

ఆకలి కొరుచిచ్చులా దహించేస్తోంది. చుట్టూ కారు చీకటిగా వుంది.

చీకటి నల్లదనాన్ని చూచికొబోలు నవ్వుతున్నాయి, చుక్కలు తెల్లగా. రెండు మూడు సార్లు దుక్కల మెఱుగులు, స్టేషను లోని ఉద్యోగుల సందడి తప్పించి అంతా నిశ్శబ్దం.

భీమయ్య బీడీ ఉందేమోనని జేబు తడుముకున్నాడు. బీడీ అయితే దొరికిందిగాని, అగ్గిపెట్టె లేదు. స్టేషనుకి పోడానికి వీల్లేదు. అధికారులు చూస్తే ఆ బండి వదలి వెళ్ళినందుకు మందలిస్తారు. ఓ సారి లేచి నుంచున్నాడు. తన బండికి ప్రక్కగా కొన్ని బళ్లు ఉన్నాయి. ఆ బళ్ళమధ్య సందుల్లో చీకటి మరింత భీభత్సంగా నాట్యమాడుతోంది.

భీమయ్య అటూ యిటూ పరికించి చూశాడు. అంతా అయోమయంగా, శూన్యంగావుంది, మరో రెండడుగులు ముందుకు వేశాడు. ఏదో నీడ తనవైపే వస్తూన్నట్లుంది ఆ చీకట్లో. భీమయ్య వళ్ళు జలదరించింది.

"ఎవరారు?" అన్నాడు భీమయ్య బిగ్గరగా

"యెవరా. నేను చాకీదారుని." అని వినపడింది. అదేమాట ప్రతిశబ్దం దూరం నుండి మళ్ళీ వినపడింది.

"నిప్పుందాభాయీ" అన్నాడు రెండడుగులు ముందుకు వేసి భీమయ్య.

"ఎవరు నువ్వు" అన్నాడు గదమాయిస్తున్నట్లు.

"నేనాకి యీ ప్రక్క పాడై పడున్న బండి బాగుచేయడానికి వచ్చిన మణిషిని."

"ఓహో, యిందు, అగ్గిపెట్టె" అంటూ అగ్గిపెట్టె అందిచ్చాడు. భీమయ్య బీడీ ముట్టించాడు. భీమయ్య అగ్గిపుల్ల వెల్తురులో చాకీదారుముఖం చూశాడు. అతని వయస్సు సుమారు ముప్ఫయి అయిదు, నలభై సంవత్సరాలకి మధ్యలో వుంటుంది. అప్పటికప్పుడే ఆ ముఖాన్ని ముసలితనం ఆవరించింది.

రెండు గ్రుక్కల పొగపీల్చి ఆ నుంచున్న చాకీదారుని "కూర్చోభాయీ" అంటూ హెచ్చరించాడు భీమయ్య.

"ఏం కూర్చోడం! కూర్చుంటే పని జరుగుతుందా యేం?" అన్నాడతను మొరటుగా.

"అరే భయ్యా, యెప్పుడూ ఉన్నవనేగా మనకి. ఆ పని కంతూ లేదు. మనకు అన్నమూ లేదు" అన్నాడు భీమయ్య తన ఆకలి జ్ఞాపకం చేసుకుంటూ.



"యేటనుకుంటే ఏం లాభంనే. మన బతుకులు మనవే" అన్నాడు చాకీదారు నేల మీద చతికిలబడుతూ.

"అవున్లే! నామాట నూడు. నలభై మైళ్ళ నుండి రాతిరికి రాతిరి ఇక్కడికొచ్చి సచ్చి పడున్నా. యిది నా పనే. ఐతేమా త్తరం!" అన్నాడు భీమయ్య కూర్చుంటూ.

"ఎక్కడనుంచొచ్చావు?"

"ఈ పక్క రెండు టేషన్ల తర్వాతవూరు. మన బడాసాబు లుంటారు అదే. ఆ పక్క మూడోబండి నూడు అది చెడింది. దాన్ని బాగు సేయడానికి పదిమంది వచ్చాము. నా దరిద్రం కొద్దీ నన్నిక్కడుండమని మా మేస్త్రీ హుకుం. సచ్చినట్టున్నాను."

"మరి పని వున్నపుడుండాల్సిందే"

"పని సెయ్యడానికి భయపడతా ననుకున్నావేటి. పాణాలొగ్గేసి పనిసేత్తా. నా బతుకు బాగోలేదు భాయీ. యేనాంటి సిక్కులొచ్చాయో యేటి సెప్పడం," అన్నాడు భీమయ్య చీకట్లోకి చూస్తూ.

"ఏమైంది సెపుదూ" అన్నాడు చాకీదారు.

"ఇంట్లో ఆడది సచ్చేసావులో వుంది. ఏదో జబ్బులు. అది కుదిరే యెత్తున్నట్టు కనిపించడం నేదు. నూత్తే అంతా సిన్నోళ్లు. ఆ డాకటరు డబ్బివ్వకపోతే మందివ్వడట. వడ్డీకి డబ్బు తెత్తే, మనబత్తెం కాత్తా వడ్డీకి సక్కాపోతే ఆకలి కడుపూ, అప్పు తెచ్చిన అసలూ మిగుల్తాయి. అంతేనా," అన్నాడు మెల్లగా నవ్వుతూ భీమయ్య.

"మన బతుకులంతే."

"నిన్న మద్దేన్నం నుంచీ సరిగా తిండి లేదు. ఆకలి సంపేత్తోంది."

"యీపక్కనే దుకాణంవుంది ఏమన్నా కొనుక్కో."

"కొనుక్కోడానికో కాణీ వుంటేగా" అన్నాడు భీమన్న సిగ్గుతో.

"ప్చ్! నువ్వెందుకూ పనికిరావల్లే వుంది."

"ఏం" అన్నాడు భీమయ్య తెల్లబోయి.

"రాత్తల్లా యిక్కడే వున్నావా?"

"ఆ! యిక్కన్నే వున్నా."

"అరె నువ్వయితే సెరటిదారినే వున్నావు."

"ఏం" అన్నాడు భీమయ్య ఆశ్చర్యంతో.

"అంత ఆకలేత్తుంటే అలా వూరుకోవడమేటి? ఎవడి నడిగినా యింత పడేత్తును."

"వంట్లో యింత శక్తివుండి, ఆకలిగురించి అడుక్కోడం యేంటి. అది నావల్ల కాదు భాయీ."

"అరె భయ్యా, దీన్లో అడుక్కోడం యేటి? మేమంతా ఎవళ్ళం యేటి? నీతోటి పనోళ్ళమవునా? ఒక భాయిని మరోభాయీ అడగడం తప్పేటి?

"నిజం, తెలివితక్కువ నేశా. పోనీలే ఏం సేత్తాం."

"అయితే ఓ పని సెపుతా."

"యేంటది?"

"ఇదిగో ఆ రెండోలైనుంది నూడు."

"ఆఁ" అన్నాడు భీమయ్య.

"దాల్లో నాలుగోబండిలో సీని వుంది."

"సీనియా."

"ఆ సీనీ—సక్కెర. ఆ బండి క్రిందకు దూరు. ఆబండి అడుగున కన్నం వుంటుంది.

ఆంధ్రప్రదేశ్ ఏజంట్లు
మెసర్సు సీతారామాంజనేయ స్టోర్సు ఏజెన్సీస్
విజయవాడ, సికిందరాబాదు.

★ సంఘటన ★

దాన్లో నూలు ఉక్కేరు. ఆ," అన్నాడు చౌకీదారు.

"ఆ!" అన్నాడు భీమయ్య భయంతో. భీమయ్య గుండె దడదడ కొట్టుకుంది.

"కాస్త తీసుకుని యీ పక్క కొట్టులో అమ్మకుని 'చా' తాగు. యీ కొత్తపని నా బీటుండగానే సెయ్యి సుమీ. మరో డ్యూటీదారా వుంటే జైల్లో పడతావు. మరి ఎవరైనా పట్టుకుంటే నా పేరుసెప్పకేం?"

"అయ్యో బాబో అంతపనే" అన్నాడు భీమయ్య.

"అరే! ఇది అందరూ చేసేపనే. కొందరు అందరి ఎదురుగ్గా సేసినా బయంలేదు. కొందరు రహస్యంగా సేసినా పట్టుకుంటారు. పట్టుకో నంతవరకు భయం నేదు. నేనున్నా ఎళ్లు. యిలా బయం. బయం అని పడున్నావంటే నీ బతుకంతే."

"అరె బాబో! దొంగపనే" అన్నాడు భీమయ్య తెంతేలుపడి.

"లోతుకుపోయి సూస్తే అన్నీ దొంగపనులే. అధికారాన్ని బట్టి ఉంటుంది."

"అమ్మో నావల్ల కాదు."

"అరె భయ్యా! నీవల్ల కానిపను లెన్నో చేస్తున్నావు. సూడు—రోగంతో పడున్న పెళ్లాన్నొదిలి రవసం నీవల్లయ్యే పనేన? ఎలా సేశావు. ఈ అర్ధరాత్రి యీ సీకట్లో దెయ్యంలా కాసుక్కూచోడం నీవల్లయ్యే పనేనా? అదే చేశావు. ఏం యెందుకు సేస్తున్నావు? తిండికోసం అవునా?

"ఆ" అన్నాడు భీమయ్య సందేహంగా.

"ఆ తిండికోసమే యీ పనీ సెయ్యి. నీకేం బయం నేదు. నువ్వేం మేడలు కట్టడానికి దొంగతనం సేయడం లేదు. ఎళ్లు బయం లేదులే" అన్నాడు చౌకీదారు.

భీమయ్య మాట్లాడకుండా వూరుకున్నాడు.

"ఏదీ, ఓ బీడీ యియ్యి" అని చెయ్యి చాచాడు చౌకీదారు. భీమయ్య యిచ్చిన బీడీ ముట్టించి "ఆ మరేం బయం లేదులే. యెళ్ళు యిదిగో యిలా సూడు. యెవతేనా వచ్చేనాగుంటే 'యీల' వేస్తాను. నువు నీ గాడీదగ్గరకు సల్లగా జారుకుని పడుకున్నట్లుండు. అంతే. మిగతా యిసయం నేజూసుకుంటాలే. నేపోతున్నా నీపని నువ్వు కానియ్యి" అంటూ చేతిలో లాట్టకర్ర ఊపుకుంటూ పోయాడు.

భీమయ్య కాస్తసేపు అలానే కూర్చుండి పోయాడు. లైనావలకు వెళ్ళి అక్కడ కొట్టు తెరచి ఉందా అని చూశాడు. దూరానున్న పాకలోనుండి చిన్న దీపం మినుకు మినుకు మంటోంది. మెల్లగా రెండో లైనులోని వాలుగో బండిదగ్గరకు వచ్చాడు. లేని మొండి ధైర్యం తెచ్చుకుని దాని క్రింద దూరాడు. చౌకీదారు వర్ణించినట్లుగా ఉందో కన్నం నూలు కప్పబడి. పంచదార పట్టుకోడానికి తన దగ్గర సంచేదీ. "అరె ఎలాగ" అనుకున్నాడు. నిరాశగా యిటూ అటూ చూశాడు.

తను కప్పుకున్న గుప్పటి మాట జ్ఞాపకమొచ్చింది. తన తెలివి తక్కువ విచారానికి తనే ఆశ్చర్యపడ్డాడు. క్రింద దుప్పటి పరచి కన్నంలో ఉన్న "నూలు ఉండ" లాగాడు. బళ్ళున పెద్ద ధార కారింది. పట్టుమని పది నిముషాలలో ఆ దుప్పటి పట్టేటంత పంచదార పోగయింది. మళ్ళీ ఆ నూలు కుక్కాడా కన్నంలో పంచదార దుప్పట్లో మూటగట్టి. రెలు లైనులుదాటి దూరానున్న పాకవైపు చీకట్లో మాయమయ్యాడు.

భీమయ్య ఆ పాకదగ్గరకు పోయాడు. తలుపులు వేసున్నాయి. కాని కిటికీ సందులోనుండి దీపం కనిపిస్తోంది. ఆ కిటికీకి ఆ సందు ఆ దీపం కనిపించడానికే వదలి ఉంటారనడాని కేమీ సందేహం లేదు. నెత్తిమీద బరువుతో క్రుంగుతూ వెళ్ళి తలుపుతట్టాడు. లోపల ఏవో గుసగుసలు వినపడుతున్నాయి. కొంచెం గట్టిగా తట్టాడు మళ్ళీ. లోపలనుండి "యెవరది" అని ప్రశ్నించారు.

"ఎవరూ లేదు. నేనే" అన్నాడు భీమయ్య వణకే గొంతుకతో. తలుపు తీయక ముందే.

"ఏమయినా తెచ్చావా" అని మళ్ళీ ఓ ప్రశ్న వినిపించింది.

"ఆ తెచ్చాను తలుపు తియ్యి ముందు" అన్నాడు భీమయ్య ధైర్యంచేసి.

తలుపు తెరవబడింది. భీమయ్యలోనికి అడుగుపెట్టాడు. తలుపు మూయబడింది కథలోలాగ. భీమయ్య ఖంగారు చూసి ఆ తలుపు తీసిన వ్యక్తి నవ్వుకున్నాడు. వాడు ఆ గదిలోనుండి మరో గదిలోనికి భీమయ్యను తీసుకుపోయాడు. ఓ మూల గోడకానుకుని ఉన్న ఓ పెద్ద బల్లమీద యిద్దరు వ్యక్తులు కూర్చున్నారు. భీమయ్యను చూడగానే ఒకతను చిరునవ్వు నవ్వుతూ "కొత్తవాడిలా వున్నావు" అన్నాడు. భీమయ్య నెత్తినున్న మూటదించి యిద్దరివైపు తేలిపార జూచాడు. "కొత్తవాణ్నే కాని పాతోడే పంపాడిక్కడికి" అని జవాబిచ్చాడు.

అంతలోనే తలుపు తీసిన వ్యక్తి, ఆ మూటను తీసుకుపోయి తూచేసి, పంచదార ఖాళీచేసి, గుప్పటిని భీమయ్య కిచ్చి, భీమయ్యను పలకరించిన ఆసామితో 'ఒక మణుగు రెండు సేర్లని" చెప్పాడు. అతడు ప్రక్కనున్న డెస్కుపెట్టె సొరుగునుండి, రెండు పదులూ, ఒక ఐదు రూపాయిల నోట్లు తీసి భీమయ్యకు యిచ్చాడు.

బజార్లో పంచదార సేరు రు-౧-౦.
భీమయ్య కే లెక్కలన్నీ తెలదు.

పాతిక రూపాయిలు చేతిలో పడగానే బొడ్డులోతోసేసి ఆనందంలో పడ్డాడు. డబ్బుయిచ్చిన ఆసామీ ప్రక్కనున్న వ్యక్తి "యింకా యేమయినా తెస్తావా" అన్నాడు.

"మాత్తాను" అన్నాడు భీమయ్య ఆశ మనస్సులో పీకుతూంటే.

"యిదిగో చూడు తెచ్చేలావుంటే వేగం తెచ్చేయి. తెల్లారిపోతే లాభంలేదు. అప్పుడే నాలుగు అవుతోంది" అన్నాడు.

భీమయ్య మాట్లాడకుండా బయటకు వడిచాడు. మరో పడి అమ్మితే మరో పాతికవస్తా యనుకున్నాడు.

ఆకాశంలో బుధుడు బాగా ప్రకాశిస్తున్నాడు.

గబాగబా మళ్ళీ ఆ బండివైపు నడిచాడు. మొదటి కన్న ధైర్యంగానూ, మొదటికన్న యెక్కువగానూ పంచదార పట్టుకెళ్ళాడు.

(41-వ పేజీ చూడండి)

PAKCO ప్యాకో స్లో-స్పీడ్, కోల్డు స్టార్టింగ్ క్రూడ్ఆయిల్ ఇంజనులు

—: ప్రత్యేక లక్షణములు :—

* పనిచేయ ప్రారంభించుట తేలిక
* తక్కువ ఇంధన ఖర్చు
* క్రమమైన నడక
* దిట్టమైన నిర్మాణం
* ఎక్కువ మన్నిక
* అద్భుతంగా పనిచేయును
* ఫాస్టఫ్యూయల్, ఇంజక్షన్ పరికరములు



మద్రాసు ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రములకు ఏజెంట్లు :

Grams "LAMP" **K. S. SHIVJI & CO.,** (Estd 1903)

Phone 3617 పోస్టు బాక్సు నెం. 5, 178-79 బ్రాడ్వే, మద్రాసు-1.

★ సంఘటన ★

(24 వ పేజీ తరువాయి)

ఈసారి మూడు పది రూపాయీల నోట్లు దొరికాయి. మరోసారి పట్టుకెడితేనష్టమేమిటనిపించింది. మళ్ళీ మరో మూట, మరో రెండు పదులు రొంటిని దోపాడు. రూపాయీలనోట్లు ఒత్తుగా మెత్తగా శరీరానికి తగుల్తున్నాయి.

భీమయ్య పాకలోంచిఅడుగు బైటపెట్టాడు. దూరాన్నుంచి కోడి అరుపు వినపడుతోంది. భీమయ్య భయంతో వణకుతూ నడుస్తున్నాడు. తప్పడయితే అటూ, యిటూ చూస్తున్నాడు. అనుమానం తట్టి దుప్పటి నాల్గుసార్లు గట్టిగాదులిపాడు. మూతి మూడు సార్లు తుడిచాడు. తన బండి దగ్గరకువచ్చి రొంటనున్న రూపాయీలు లెక్కపెట్టేడు. రెండు పదులు ఒకవైపూ మిగతా డబ్బు మరోవైపూ దోపాడు రొంటిని. దుప్పటి పరచిపడుకున్నాడు ఆకాశంలోకి చూస్తూ. ఈల వినిపించింది. కళ్ళుమూశాడు భీమయ్య. హృదయం దడదడ కొట్టుకుంటూంది.

చాకీదారు వచ్చాడు. మామూలుగా "ఎవరారు" అన్నాడు. భీమయ్య దొంగ చూపుచూశాడు. చౌకిదారు నిలబడ్డాడు తూకంగా. చుక్కల కాంతిలో అతని ముఖంలో చిరునవ్వు కనిపిస్తోంది.

"నేను" అన్నాడు భీమయ్యకూర్చుంటు.

"బాగుందా" అన్నాడు చాకీదారు.

"బాగుంది" అన్నాడు భీమయ్య రొంటిని విడిగాపెట్టిన రెండు పదుల కాగితాలు పైకి లాగుతూ.

"యేటి సంగతి"

"ఇయిగో నీసలవ్వల్ల రెండు పదులు సంపాయించా" అన్నాడు నవ్వుతూ భీమయ్య.

బ్రాంచి : విజయవాడ.

"అంతేనా" అన్నాడు చాకీదారు డబ్బంతే లెక్కలేనట్లు.

"అది సాలు భాయీ, అట్టే సెయ్యడానికి ధైర్యం సాల్లేదు."

"అరే! నువ్వెందుకు వనికోస్తావు. అంత భయందేనికి. నేనున్నాగా."

"యిరవై రూపాయలు! మాటలా" అన్నాడు భీమయ్య నెమ్మదిగా.

"అరె నీ పెళ్ళాం జబ్బుకే చాలదు. యేటింతభయం!" అన్నాడు చాకీదారు.

"యిదే చాలు. యీపదీనువు తీసుకో. ఈ పదీ నాకుంటాయి," అంటూ భీమయ్య చాకీదారుకి పది యివ్వబోయాడు. భీమయ్య అమాయక ముఖం చూసి చాకీదారు కొస్త చలించేడు.

"చూడు భాయీ, యీ డబ్బు నువ్వు పాణాలమీద ఆశవదులుకు గడించుకున్నది. నాకొద్దు నీపెళ్ళాం జబ్బుకుదుర్చుకోదింతోటి" అన్నాడు చాకీదారు. భీమయ్య యెంత బ్రతిమాలినా 'ససేమిరా' తీసుకోలేదు. భీమయ్యను మందలించాడు కూడా. భీమయ్య అతని ప్రవర్తనకి ఆశ్చర్యపడ్డాడు.

తెల్లవారుతోంది. వెలుతురు చీకట్లు మసకగా మాట్లాడుతున్నాయి. "తెల్లవారింది. నాడ్యూటీ అయింది. నేపోతా దయవుంచు అంటూ పోయాడు చాకీదారు. భీమయ్య చేతుల్లో రూపాయినోట్లు అల్లాగే పట్టుకుని నిర్ఘాంతపోయి చూస్తున్నాడు. కొంత దూరంవెళ్ళి చాకీదారు వెనుదిరిగి చూచి భీమయ్యకు ఆరూపాయిలు దాచేయమని సౌంజ్ఞచేసి వెళ్ళిపోయాడు తనకూ అతనికీ యేమీ సంబంధంలేనట్లు చాకీదారు వెళ్ళిపోగానే భీమయ్య రూపాయినోట్లు దాచుకుని కూర్చున్నాడు.

బాగా తెల్లవారిపోయింది. మొఖం చేతులూకడుక్కుని ఎనిమిది గంటలకు స్టేషను మాష్టరు గదిలోకి వెళ్ళేడు. మాష్టరుగారికి తన సంగతిచెప్పి కావలసిన కాగితాలుయిమ్మన్నాడు. స్టేషనుమాష్టరుగారు అవసరమయిన కాగితాలు భీమయ్యకు యిచ్చేశారు. సరిగ్గా టైముకు భీమయ్య వూరుపొయ్యే పాశింజరు బండికూడా వచ్చేసింది.

భీమయ్య యివతలకు వస్తూండగా ఒక వ్యక్తి తోసుకుంటూ మాష్టరుగారి గదిలోకి వెడుతున్నాడు. తెల్లటి టోపీ, మల్లెపూవు లాంటి తెల్లటి వడికిన నూలుబట్టలు కట్టుకున్న ఆ వ్యక్తిని చూడగానే ఎవరికైనా గౌరవభావం కలుగకపోదు. అనుకోకుండానె భీమయ్య ఆయనకో నమస్కారం పెట్టాడు. ఆయనకూడా చిరునవ్వుతో ఆనమస్కారం స్వీకరించి లోనికిపోయాడు.

భీమయ్య సంతృప్తితో బండిలో యెక్కడానికి వెడుతున్నాడు. ఎదురుపడ్డ పోర్టరును "ఆబాబుగోరెవరు" అని వాకబుచేశాడు.

"అరె, ఆరితెరగవా! ఈ వూరి కల్లా పెద్ద సాహుకారుగోరు. చాలా మంచోడు లే. ఆయన్నెరగనోడు యీజిల్లాలో లేడు సాన గొప్పోడు" అన్నాడు ముందుకుపోతూ ఆగకుండానే.

భీమయ్య బొడ్డుతడుముకుంటూ బండిలో యెక్కాడు. బొడ్డున పెట్టిన రూపాయి నోట్లు ఒత్తుగా తగులుతున్నాయి." ఈసారి డాక్టరుకే కాసేస్తా," అనుకున్నాడు మనస్సులో.

రైలు కదిలింది. కిటికీలో నుండి స్టేషను వైపు చూస్తున్నాడు భీమయ్య. స్టేషనుమాష్టరుగారూ, భీమయ్య నమస్కరించిన పెద్దమనిషీ మాట్లాడుతూ యివతలకు వచ్చారు. అంతా అతనికి నమస్కారాలు పెడుతున్నారు భక్తితో. భీమయ్యకాయన చిరునవ్వుజ్ఞాపకమొచ్చింది.

"చాలా అందంగా నవ్వుతాడు. చాలా సోకుగా, దర్జాగా వుంటాడు. చాలా తియ్యగామాట్లాడతాడు. చాలా మంచోడుట కూడా" అనుకున్నాడు మనస్సులో.

రైలు నడుస్తోంది. ఆముఖం, ఆచిరునవ్వు మళ్ళీ జ్ఞాపకంవచ్చాయి భీమయ్యకు. డబ్బు పదిలంగా వుందోలేదో ఓసారి చూసుకున్నాడు. నడుంకి మెత్తగా, ఒత్తుగా ఒత్తుకుంటోంది. అప్పుడే రెండు స్టేషనులు పోయాయి.

ఆముఖం, ఆచిరునవ్వు మళ్ళీ జ్ఞాపకం వచ్చాయి. భీమయ్యకు యెప్పుడో, యెక్కడో చూచిన జ్ఞాపకం, యెప్పుడో? ఎక్కడో?

తనవూరు వచ్చింది. దిగితిన్నగా కార్ఖానాకుపోయి మేస్త్రీకి కాగితాలు యిచ్చేశాడు. మళ్ళీ ఆమొఖం, ఆచిరునవ్వు జ్ఞాపకంవచ్చాయి. డబ్బు జాగ్రత్తగానే వుంది. "ఎవడు చెప్మా" అనుకున్నాడు భీమయ్య తనలో. "వారినీ నువ్వా" అన్నాడు భీమయ్య ఆశ్చర్య సంభ్రమాలతో. భీమయ్యకు ఆపాకలో డబ్బిచ్చిన ఆసామీ ప్రక్కన నవ్వుతూ కూర్చున్న వ్యక్తి జ్ఞాపకంవచ్చాడు. "అదే ముఖం!" మేస్త్రీకి భీమయ్య అన్న మాటలు బోధపడలేదు.

"ఏంట" దన్నాడు విసుగ్గా.

"మీ గురించికాదు. యేయీ లేదు" అంటూ యింటివేపు నడిచాడు.

"ఆడికీ మనకీ తేడాలేదు. అనవసరంగా నమస్కారం పెట్టానే" అనుకున్నాడు మనస్సులో. భీమయ్య మనస్సు చివుక్కుమంది. ★